సాక్షి ములుగు

బుధవారం । 9 । జూలై । 2025



అవసరం లేకున్నా కేటాయింపు..

టీజీఎన్పీడీసీఎల్‌కు మంజూరైన కొత్త పోస్టుల్లో తమకు అన్యాయం జరిగిందని ఎమ్మార్టీ విభాగం ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. - 8లో▶



ఆదివాసీ సంస్కృతి ప్రకారమే జాతర నిర్వహించాలి

ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాల ప్రకారం మేడారం జాతర నిర్వహించాలని పూజారులు కోరారు. - 8లో▶

వాతావరణం

గరిష్టం/కనిష్టం 29.4⁰ /26.3⁰

జిల్లాలో ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం సాధారణ పరిస్థితి ఉంటుంది. పలుచోట్ల మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా స్వర్ణకుమారి

ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా చంద్రశేఖర్



చంద్రశేఖర్

ములుగు రూరల్: జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా స్వర్ణకుమారి, ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా చంద్రశేఖర్‌లను నియమిస్తూ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చోంగ్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సిద్దిపేట మెడికల్ కళాశాల చర్మవ్యాధి విభాగంలో ప్రొఫెసర్‌గా పని చేస్తున్న డాక్టర్ మోహన్‌లాల్‌ను డిప్యూటేషన్‌పై జిల్లా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా, ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించారు. వరంగల్ ఎంజీఎంలో చర్మ వ్యాధి విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న స్వర్ణకుమారిని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పదోన్నతి కల్పించి నియమించారు. ప్రస్తుతం జనరల్ మెడిసిన్ విభాగంలో ములుగు మెడికల్ కళాశాలలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ చంద్రశేఖర్‌కు పదోన్నతి కల్పించి ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా నియమించారు.

వరదల సమయంలో అప్రమత్తం



ములుగు రూరల్: వరదల సమయంలో ముంపు గ్రామాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్ఓ గోపాల్‌రావు అన్నారు. మండల పరిధిలోని రాయినిగూడెం వైద్యశాలలో వైద్యాధికారులు, సిబ్బందితో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముంపు గ్రామాల్లోని గర్భిణులు వర్షాకాలం వరదల సమయంలో ముందస్తుగానే సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు. ఆరోగ్య కేంద్రాల్లో రాపిడ్ యాక్షన్ టీం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మలేరియా, డెంగీ వ్యాధులు వచ్చినప్పుడు తక్షణమే గ్రామాలను సందర్శించి దోమల నివారణ చర్యలు చేపట్టాలన్నారు. వైద్య సిబ్బంది గ్రామాల్లో ఇంటింటి ఫీవర్ సర్వే చేపట్టాలన్నారు. నీటి నిల్వలపై దృష్టి సారించి తొలగించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు అన్వేష్, జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ పవన్ కుమార్, శ్రీకాంత్, రణధీర్, సంపత్, సురేష్ పాల్గొన్నారు.

గీత కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



ములుగు రూరల్: గీత కార్మికులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని గీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బుర్రి శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గీత కార్మికులకు పెండింగ్‌లో ఉన్న ఎక్స్‌గ్రేషియా, తాడి కార్పొరేషన్ చెక్కులు తక్షణమే మంజూరు చేయాలన్నారు. ఏజెన్సీ, నాన్ ఏజెన్సీ సంబంధం లేకుండా గీత కార్మికులకు పింఛన్ ఇవ్వాలని సూచించారు. ఏజెన్సీలో రద్దు చేసిన గీత కార్మిక సొసైటీలను తక్షణమే పునరుద్ధరించాలన్నారు. జిల్లా కేంద్రంలో సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ నెల 14న నిర్వహించనున్న నిరాహార దీక్షను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవి, సత్యనారాయణ, రమేష్ పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



ఏటూరునాగారం: మహిళలు ఆర్థికంగా ఎదగాలని సెర్ప్ జిల్లా ఏపీడీ శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని సెర్ప్ కార్యాలయంలో ఇందిరా మహిళా శక్తి సంబురాల కార్యక్రమాన్ని డీఆర్‌డీఏ, సెర్ప్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులు ఆర్థిక సాధికారత సాధించే దిశగా అవగాహన కల్పించామన్నారు. గ్రూపులో లేని సభ్యులను సంఘాలలో చేర్పించాలని సూచించారు. వృద్ధులు, కిశోర బాలికలతో సంఘాలు ఏర్పాటు చేసి గతేడాది, ఈ ఏడాది సాధించిన ఆర్థిక ప్రగతి, లక్ష్యాలపై సభ్యులకు, సిబ్బందికి వివరించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఏపీఎం సతీష్, మండల సమాఖ్య అధ్యక్షురాలు పద్మ, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

చేపల వేట నిషేధం

పునరుత్పత్తి దశ కావడంతో మత్స్యశాఖ నిర్ణయం

- జూలై, ఆగస్టు మాసంలో చెరువుల్లో చేపలు పడితే చర్యలు
- ప్రతినెలా 400 టన్నుల చేపల ఉత్పత్తి
- జిల్లా వ్యాప్తంగా 4,853 మంది మత్స్యకార్మికులకు ఉపాధి



వెంకటాపురం(ఎం): జిల్లాలోని జలాశయాలు, చెరువులు, కుంటలలో జూలై, ఆగస్టు మాసాల్లో మత్స్య కార్మికులు చేపలు పట్టకుండా మత్స్యశాఖ నిషేధాజ్ఞలు జారీ చేసింది. శాఖ ఆదేశాలు ఉల్లంఘించి ఎవరైనా చేపలు పడితే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. జూలై, ఆగస్టు నెలల్లో చేపల పునరుత్పత్తి ప్రక్రియ జరుగుతుంది కాబట్టి మత్స్యకారులు చేపల వేటకు వెళ్లి పునరుత్పత్తి ప్రక్రియను దెబ్బతీయవద్దని అధికారులు సూచిస్తున్నారు. జిల్లాలోని రామప్ప సరస్సు, లక్నవరం జలాశయం, తుపాకులగూడెం ప్రాజెక్టు, నర్సింహసాగర్ ప్రాజెక్టు, పాలెం ప్రాజెక్టు లాంటి జలాశయాలపై పూర్తిస్థాయి మానిటరింగ్ ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు.

రెండు కిలోల నుంచి..
రూ. రెండు లక్షల పిల్లలు

ఒక రెండు కిలోల చేప నుంచి రెండు లక్షల రూపాయలకు పైగా పిల్లలు పునరుత్పత్తి జరుగుతాయని మత్స్యశాఖ అధికారులు పేర్కొంటున్నారు. అందులో 10 శాతం బతికినా 20 వేల చేపలు ఉత్పత్తి అవుతాయి. ఈ రెండు నెలల్లో ఒక్క చేపను కోల్పోయినా దాని నుంచి వచ్చే లక్షల చేప పిల్లలను కోల్పోయినట్లేనని అధికారులు వెల్లడిస్తున్నారు. ఈ మేరకు జలాశయాల్లో చేప పిల్లల సంఖ్యను పెంచేందుకు మత్స్యశాఖ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. చేపల పునరుత్పత్తి ప్రక్రియను దెబ్బతీస్తే సహించేది లేదని అధికారులు వెల్లడిస్తున్నారు.

400 టన్నుల చేపల ఉత్పత్తి

జిల్లాలో నెలకు సుమారు 400 టన్నుల చేపల ఉత్పత్తి జరుగుతుంది. జిల్లా వ్యాప్తంగా ప్రధాన జలాశయాలతో పాటు 493 చెరువులు, కుంటలు ఉండగా వాటి పరిధిలో 14,204 హెక్టార్ల విస్తీర్ణం గల భూమి ఉంది. జిల్లాలో 66 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు ఉండగా 4,853 మంది మత్స్యకారులు సభ్యులుగా ఉన్నారు. వీరంతా చెరువులు, కుంటల్లోని చేపలను పట్టుకుని ఉపాధి పొందుతున్నారు.

చెరువుల్లోని చేపలతోనే ఉత్పత్తి

గత కొన్నేళ్లుగా జిల్లాలోని ప్రధాన జలాశయాలతో పాటు చెరువుల్లో 100 శాతం సబ్సిడీపై చేప పిల్లలను వదులుతున్నారు. గతేడాది జిల్లా వ్యాప్తంగా 79.83 లక్షల చేప పిల్లలను సబ్సిడీపై చెరువుల్లో విడుదల చేశారు. చేప పిల్లలను చెరువుల్లో వదిలే సమయం సరిగా లేకపోవడంతో చిన్న చేప పిల్లలను పెద్దవి తినడంతో పాటు వాతావరణం సహకరించక చేపపిల్లలు మృతిచెందుతూ వస్తుండడంతో ఈ పథకంతో ఆశించిన స్థాయిలో ఫలితాలు రావడం లేదు. ప్రస్తుతం ఉన్న చేపలను రెండు నెలల పాటు వేటాడకుండా అలాగే వదిలేస్తే ప్రభుత్వం ఇచ్చే చేప పిల్లలు అవసరం లేకుండా, చెరువుల్లోని చేపలతోనే లక్షలు, కోట్ల చేపలు ఉత్పత్తి అయ్యే అవకాశం ఉంటుంది.

నిషేధం ఎందుకంటే..

వర్షాకాలంలో వర్షాలు సమృద్ధిగా కురుస్తాయి. ఈ సమయంలో చేపల్లో పునరుత్పత్తి హార్మోన్ బలంగా అభివృద్ధి చెందుతుంది. జూలై, ఆగస్టులో చేపలు తమ పునరుత్పత్తిని ప్రారంభిస్తాయి. ఆడ చేపలు ఎగ్ రిలీజ్ చేస్తే, మగ చేపలు స్పెర్మ్‌ను రిలీజ్ చేస్తాయి. దీంతో చేప పిల్లలు బయటకు వస్తాయి. ముఖ్యంగా వర్షాకాలంలో జలాశయాల్లోకి కొత్త నీరు వస్తుండటంతో పాటు చెత్తాచెదారం కొట్టుకుని వచ్చి నీళ్లపై తేలుతూ ఉంటుంది. ఈ సమయంలో చెత్తాచెదారం కింది భాగంలో ఆడ చేపలు గుడ్లపై పొదుగుతుంటాయి. వాటిపై సూర్యరశ్మి పడి రెండు మూడు రోజుల్లోనే గుడ్ల నుంచి చేప పిల్లలు బయటకు వస్తాయి. ఈ ప్రక్రియంతా జూలై, ఆగస్టు నెలల్లో 3 నుంచి 5 సార్లు సాగుతుంది.

రెండు నెలలు నిషేధం



జూలై, ఆగస్టు నెలల్లో జిల్లాలోని జలాశయాల్లో, చెరువులు, కుంటలలో చేపల వేటను నిషేధించడమైంది. ఈ రెండు నెలల్లో ఒక్కచేపను పట్టినా లక్షల చేపలను పుట్టకుండా చేసినట్లే. జూలై, ఆగస్టు నెలల్లోనే చేపలు పునరుత్పత్తి చేస్తుంటాయి. కాబట్టి జలాశయాల్లోని చేపలకు ఇబ్బంది కలగకుండా మత్స్యకారులు సహకరించాలి. ఎవరైనా చేపలు పడితే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలి.

\- సల్మాన్ రాజ్, జిల్లా మత్స్యశాఖాధికారి

వైఎస్సార్ సేవలు మరువలేనివి



వైఎస్ రాజశేఖర రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి సీతక్క

మంత్రి ధనసరి సీతక్క

ములుగు రూరల్: జనహృదయ నేత దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి సేవలు మరువలేనివని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ 76వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి సీతక్క హాజరై వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా రాష్ట్ర ప్రజలకు వైఎస్సార్ ఎనలేని సేవలందించిన మహోన్నత వ్యక్తి అన్నారు. సీఎంగా వైఎస్సార్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశానికే దిక్సూచిగా మారాయని తెలిపారు. రైతులకు ఏక కాలంలో రుణమాఫీ చేసిన ఘనత ఆయనదే అన్నారు. 104, 108 అత్యవసర వైద్య సేవలు, ఆరోగ్యశ్రీ, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు, ఇందిర జలప్రభ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆత్మగౌరవాన్ని పెంచి దేశ మొత్తం గర్వించదగ్గ నాయకుడిగా మన్ననలు పొందారన్నారు. నిరుపేదలకు సంక్షేమ పథకాలను అందించి పేదల పెన్నిధిగా వైఎస్సార్ నిలిచారని ఆయన సేవలను మంత్రి కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కల్యాణి, జిల్లా, మండల స్థాయి నాయకులు పాల్గొన్నారు.



ఘనంగా సీత్లా పండుగ

ఎస్ఎస్‌తాడ్వాయి: మండల పరిధిలోని నార్లాపూర్ గల లంబాడి తండాలో బంజార గిరిజనులు మంగళవారం సీత్లా పండుగను ఘనంగా నిర్వహించారు. ఇళ్లలో పాయసం, జొన్న గుగ్గిళ్లు తయారీ చేసుకుని బోనమెత్తి ఊరి పొలిమేరలో తెచ్చిన పాయసాన్ని పోసి పశువులను వాటి మీద నుంచి దాటించారు. అనంతరం సీత్లా భవానికి బోనం సమర్పించి కోళ్లను, మేకలను బలి ఇచ్చారు. సంప్రదాయ నృత్యాలు చేస్తూ పండుగ నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా బంజార నాయకుడు శ్రీనివాస్ మాట్లాడుతూ.. పంటలు బాగా పండాలని కోరారు.

అభివృద్ధిని చూసి తట్టుకోలేక అవాక్కులు

- అమాయక ప్రజలను ఆత్మహత్యకు ప్రేరేపిస్తున్నారు
- మంత్రి సీతక్క



మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ములుగు రూరల్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక బీఆర్ఎస్ పార్టీ అసత్య ఆరోపణలు చేస్తుందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మంత్రి డాక్టర్ ధనసరి సీతక్క అన్నారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో బాధితులు మాట్లాడారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ జిల్లాలో జరుగతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్ష నాయకులు బరదచల్లె ప్రయత్నాలను మానుకోవాలని హితవు పలికారు. చల్వాయి గ్రామానికి చెందిన చుక్క రమేష్‌కు రెండు గదుల రేకుల షెడ్ ఉందని అందుకు ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో ఎంపిక కాలేదన్నారు. కాంగ్రెస్ నాయకులు బెదిరింపులకు ఆత్మహత్యకు పాల్పడ్డారని ఆస్పత్రుల్లో ఫొటోలకు పోజులు బీఆర్ఎస్ నాయకులు రమేష్ కుటుంబాన్ని పరామర్శించారు. జిల్లాలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక కేటీఆర్ తన మిడతల దండుతో నియోజకవర్గంలో డ్రామాలు చేస్తున్నారని తెలిపారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గాలకు చెందిన పోలీసు అధికారులు విధులు నిర్వహిస్తున్నారని వివరించారు. 70 ఏళ్ల చరిత్రలో గిరిజన మహిళకు సీఎం రేవంత్‌రెడ్డి, రాహుల్‌గాంధీలు మంత్రి పదవి ఇచ్చారని పదవి దక్కితే ఓర్చుకోలేక అసత్యపు ప్రచారాలు చేస్తున్నారన్నారు. ఆదివాసీ సాంప్రదాయాలకు అనుగుణంగా మేడారంలో అభివృద్ధి పనులు చేస్తున్నామని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దందాలు, ఇసుక, ఎర్రమట్టిక్వారీలు, దోపిడీకి పాల్పడుతున్నారని తదితర వివరాలను వెల్లడించారు. జిల్లాలో ఇందిరమ్మ ఇళ్లకు 60 వేల దరఖాస్తులు వస్తే అరుమలైన 20 వేల మందిని ఎంపిక చేశామని అందులో మొదటి విడతలో 5 వేల మందికి ఇందిరమ్మ ఇండ్లను కేటాయించామని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లను విడుతల వారిగా కేటాయిస్తామని అన్నారు.

కార్యకర్తలను బెదిరిస్తే ఊరుకోం

బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బడే నాగజ్యోతి



మాట్లాడుతున్న బడే నాగజ్యోతి

ములుగు రూరల్: గోవిందరావుపేట మండలం చల్వాయి గ్రామానికి చెందిన చుక్క రమేశ్ మృతికి మంత్రి సీతక్క కారణమని ఏ-1 ముద్దాయిగా కేసు నమోదు చేయాలని, బీఆర్ఎస్ కార్యకర్తలను బెదిరిస్తే ఊరుకోమని పార్టీ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బడే నాగజ్యోతి అన్నారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాగజ్యోతి మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్లు అనర్హులకు కేటాయించారని, సీతక్క చల్వాయి గ్రామానికి ఏం చేసిందని వాట్సాప్ గ్రూప్‌లో ప్రశ్నించినందుకు కాంగ్రెస్ నాయకుల బెదింపులకు రమేశ్ ఆత్మహత్య చేసుకున్నాడని వివరించారు. కాంగ్రెస్ నాయకుల అవినీతి, అక్రమాలు నిలదీస్తూ జిల్లా కేంద్రంలో నిరసన తెలిపితే పోలీస్ యాక్ట్ అమలు చేశారన్నారు. అదే విధంగా చల్వాయిలో నిరసన చేపడుతుంటే కరెంట్ కట్ చేశారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలన్నారు. మంత్రి సీతక్కకు అబద్ధాలు చెప్పడం, రీల్స్ చేయడం తప్ప పనిచేయడం తెలియదన్నారు. శనిగకుంట, బంధాల గ్రామాల్లో ప్రజలకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని, కొండాయి ప్రజలకు బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ కార్యకర్తలను బెదిరింపులకు గురిచేస్తే ఊరుకోమని హెచ్చరించారు. అనంతరం బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ హనుమకొండ శివారులో రామారం, బీమారం, ఉనికిచర్ల, దేవన్నపేట ప్రాంతాల్లో భూదందాలు చేపట్టారని ఆధారాలతో నిరూపిస్తామని సవాల్ విసిరారు.

గొత్తికోయలు గొడవలు పెట్టుకోవద్దు



సమస్యలను అడిగి తెలుసుకుంటున్న డీఎస్పీ

ఎస్ఎస్‌తాడ్వాయి: తాడ్వాయి- పస్రా మార్గ మధ్యలోని తోగు గొత్తికోయగూడెంలో అందరూ కలిసి మెలిసి ఉండాలని తగాదాలు పెట్టుకోవద్దని, ఏమైనా సమస్యలు ఉంటే పోలీసులను సంప్రదించి పరిష్కరించుకోవాలని డీఎస్పీ రవీందర్ సూచించారు. ఈ మేరకు మంగళవారం ఆయన గొత్తికోయ గూడెంలోని సమస్యల గురించి గిరిజనులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ రవీందర్ గొత్తికోయలతో మాట్లాడారు. ఆయన వెంట పస్రా సీఐ రవీందర్, తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డిలు ఉన్నారు. అనంతరం ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి కాటాపూర్ క్రాస్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహనాల పెండింగ్ చలాన్లను కట్టించారు.

అభివృద్ధి పథం..

- మానుకోట జిల్లా సోమ్లాతండా, కేసముద్రంలో రూ.400కోట్ల పనులకు శంకుస్థాపనలు
- హాజరైన డిప్యూటీ సీఎం, ఐదుగురు మంత్రులు



కేసముద్రంలో నిర్వహించిన సభకు హాజరైన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వర్‌రావు, డిప్యూటీ స్పీకర్ రాంచంద్రునాయక్, ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యేలు మురళీనాయక్, నాగరాజు, కనకయ్య

సాక్షి, మహబూబాబాద్/ కేసముద్రం/మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 400కోట్లు మంజూరు చేసింది. ఈమేరకు మంగళవారం అభివృద్ధి పనుల శంకుస్థాపనకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, ధనసరి సీతక్క, కొండా సురేఖ, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సోమ్లాతండా, కేసముద్రంలో ఏర్పాటు చేసిన బహిరంగసభలకు మహిళలు, కార్యకర్తలు భారీగా హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను అలరించాయి.



సోమ్లాతండాలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు



మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

రూ.400కోట్ల పనులకు శంకుస్థాపన

మహబూబాబాద్ పరిధిలో సుమారు రూ.100కోట్లతో రహదారులు, మున్సిపాలిటీ అభివృద్ధి, ట్రైబల్ వెల్ఫేర్ భవనాలు, నూతన సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. అలాగే రూ.300కోట్లతో కేసముద్రం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ భవన నిర్మాణం, అంగన్‌వాడీ కేంద్రం, పట్టణంలో 30పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నిర్మాణం, నూతన సబ్‌స్టేషన్లు, సీసీరోడ్లు, కల్వర్టులు, అంతర్గత రోడ్ల అభివృద్ధి పనులు, ఎస్సీ కమ్యూనిటీ హాల్, నూతన గిడ్డంగుల నిర్మాణం, ఆలయాల అభివృద్ధి, తదితర పనులకు శంకుస్థాపన చేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రొసీడింగ్ పత్రాల పంపిణీ, జిల్లాలోని స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు మంజూరు చేశారు.

కార్యకర్తల్లో జోష్..

బహిరంగ సభల్లో డిప్యూటీ సీఎం, మంత్రుల ప్రసంగాలతో కాంగ్రెస్ కార్యకర్తల్లో జోష్ నిండింది. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించాలని మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రైతులకోసం రూ.70వేల కోట్లు ఖర్చు చేసి, రైతు ప్రభుత్వమని నిరూపించుకున్నామన్నారు. మహబూబాబాద్ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. జిల్లాకు గోదావరి జలాల మళ్లింపుపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ మాట్లాడుతూ.. మారుమూల ప్రాంతమైన మానుకోట అభివృద్ధికి మరిన్ని నిధులు ఇవ్వాలని, ఇంజనీరింగ్ కళాశాల, ఔటర్ రింగ్‌రోడ్డుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమాల్లో డిప్యూటీ స్పీకర్ రాంచంద్రునాయక్, ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యేలు కనకయ్య, నాగరాజు, ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్, కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో, కేసముద్రం మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవరెడ్డి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రులు ఏమన్నారంటే...
\- వివరాలు 8లో▶

ఆయిల్ పామ్ విస్తరణ లక్ష్యాలను పూర్తిచేయాలి

కలెక్టర్ టీఎస్.దివాకర

ములుగు రూరల్/ఎస్ఎస్‌తాడ్వాయి: ఆయిల్ పామ్ విస్తరణ లక్ష్యాలను పూర్తి చేయాలని కలెక్టర్ టీఎస్.దివాకర అన్నారు. ఈ మేరకు మంగళవారం ప్రాసెసింగ్ ఇండస్ట్రీ నిర్మాణ పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి అసరమైన డాక్యుమెంట్లు, అనుమతులు, మౌలిక వసతుల కల్పన, కావాల్సిన ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ హార్టికల్చర్ సహకార సంఘాల బలోపేతానికి ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెడుతుందని వివరించారు. పంట మార్పిడి ఆయిల్ పామ్ సాగు పై క్షేత్ర స్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే జిల్లా విద్యాశాఖ, దిశా ఫౌండేషన్, ఈఎల్ఎఫ్‌వారి సౌజన్యంతో జిల్లాలో విద్యార్థులకు ఇంగ్లిష్‌పై ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించినట్లు తెలిపారు. పాఠశాల పరిసరాలను పరిశీలించారు, స్టోర్ గదిని పరిశీలన చేశారు.

వెజ్, నాన్‌వెజ్ మార్కెట్లకు స్థల పరిశీలన

ఏటూరునాగారం: ఏజెన్సీలోని ప్రజల అవసరాల నిమిత్తం వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ల నిర్మాణానికి ప్రభుత్వం చొరవ చూపుతుందని కలెక్టర్ టీఎస్.దివాకర అన్నారు. మండల పరిధిలోని బూటారం గ్రామంలోని ముంపు బాధితులకు ఇళ్ల స్థలాల కోసం ఎక్కెల సమీపంలోని ప్రభుత్వ స్థలాన్ని అదనపు కలెక్టర్(రెవెన్యూ) మహేందర్‌జీతో కలిసి మంగళవారం పరిశీలించారు. అలాగే ఏటూరునాగారంలోని అటవీశాఖ నర్సరీ ఉన్న ప్రాంతంలో వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ల నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్, డీఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్‌తో కలిసి చిన్నబోయినపల్లిలోని సర్వే నంబర్ 98 అటవీ శాఖలోని భూమి సాగుదారులకు ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు ఇవ్వడం వీలు కాదన్నారు.



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్

క్లుప్తంగా

19 వరకు ఎంఏ తెలుగు పరీక్ష ఫీజు గడువు

హన్మకొండ కల్చరల్ : సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం జానపద గిరిజన విజ్ఞానపీఠంలో 2024–2025 విద్యా సంవత్సరానికి రెగ్యులర్ ఎంఏ తెలుగు మొదటి సంవత్సరం రెండో సెమిస్టర్ పరీక్ష ఫీజు ఈ నెల 19వ తేదీ లోపు చెల్లించాలని పీఠం పీఠాధిపతి గడ్డం వెంకన్న మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఈ నెల 19వతేదీ సాయంత్రం 5గంటలలోపు తమ దరఖాస్తులను పీఠం కార్యాలయంలో సమర్పించాలన్నారు. అలాగే, ఈ నెల 23 వరకు ఆలస్య రుసుముతో చెల్లించొచ్చని తెలిపారు. వివరాలకు 9989417299, 9989139136 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

భాగ్యనగర్, గోల్కొండ, శాతవాహన రైళ్లకు పర్మనెంట్ కోచ్‌ల పెంపు

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్, వరంగల్ మీదుగా ప్రయాణించే భాగ్యనగర్, గోల్కొండ, శాతవాహన ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అప్ అండ్ డౌన్ మార్గంలో ప్రయాణికుల సౌకర్యార్థం అదనంగా ఒక 3 ఏసీ (ఎకనామి) కోచ్‌ను పర్మనెంట్ పెంపుదల చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ మంగళవారం తెలిపారు.

థర్డ్ ఏసీ (ఎకనామి) రైళ్ల కోచ్‌ల వివరాలు..

జూలై 13వ తేదీ నుంచి సికింద్రాబాద్–సిర్పూర్‌కాగజ్‌నగర్ (17233) భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ , జూలై 14వ తేదీ నుంచి సిర్పూర్‌కాగజ్‌నగర్–సికింద్రాబాద్ (17234) భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్, జూలై 13 తేదీ నుంచి గుంటూరు–సికింద్రాబాద్ (17201) గోల్కొండ ఎక్స్‌ప్రెస్, జూలై 14వ తేదీ నుంచి సికింద్రాబాద్–గుంటూర్ (17202) గోల్కొండ ఎక్స్‌ప్రెస్, జూలై 13వ తేదీ నుంచి విజయవాడ–కాచిగూడ (12713) శాతవాహన ఎక్స్‌ప్రెస్, జూలై 13వ తేదీ నుంచి కాచిగూడ–విజయవాడ (12714) శాతవాహన ఎక్స్‌ప్రెస్ రైళ్లకు థర్డ్ ఏసీ (ఎకనామి) కోచ్‌లు పెంచినట్లు సీపీఆర్వో ఎ.శ్రీధర్ తెలిపారు.

కోతుల బెడదను నివారించాలని రాష్ట్రపతికి ఉత్తరం

- పోస్ట్ చేసిన మహబూబాబాద్ జిల్లా గార్లవాసి


కందునూరి ఈశ్వర్‌లింగం

గార్ల: మహబూబాబాద్ జిల్లా గార్ల మండలంలో కోతుల బెడదను నివారించాలని కోరుతూ గార్లకు చెందిన కందునూరి ఈశ్వర్‌లింగం మంగళవారం రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము, సుప్రీంకోర్టు జడ్జికి లేఖ రాసి స్పీడ్‌పోస్ట్ చేశారు. మండలంలో కోతుల బెడద తీవ్రంగా ఉందని, ఇళ్లల్లోకి చొరబడి బీభత్సం సృష్టిస్తున్నాయని పేర్కొన్నారు. పిల్లలు పాఠశాలలకు వెళ్లాలంటే భయపడుతున్నారని, ఇక పత్తి, వరి పంటలను పూర్తిగా ధ్వంసం చేస్తున్నాయన్నారు. పలుమార్లు కలెక్టర్, అధికారులకు మొర పెట్టుకున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ఉత్తరం ద్వారా వివరించారు. కోతుల సమస్యపై జిల్లాలో ఎవరూ పట్టించుకోకపోవడంతోనే రాష్ట్రపతి, సుప్రీంకోర్టు జడ్జికి ఉత్తరం రాసి పోస్ట్ చేసినట్లు ఈశ్వర్‌లింగం వెల్లడించారు.

అవసరం లేకున్నా కేటాయింపు..

ఎమ్మార్టీ విభాగంలో ఉపయోగం లేని ఎఎల్‌ఎం పోస్టుల సృష్టి..

- సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ పోస్టులు పెంచాలని కోరిన ఉద్యోగులు
- అయినా పట్టించుకోని టీజీఎన్పీడీసీఎల్ యాజమాన్యం
- ఫలితంగా ఆ విభాగం ఉద్యోగుల్లో నిరుత్సాహం
- ఏళ్లుగా పని చేస్తున్న సీనియర్లకు లేని పదోన్నతి అవకాశం


టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం

హన్మకొండ: తెలంగాణ నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీకి మంజూరైన కొత్త పోస్టుల్లో తమకు అన్యాయం జరిగిందని ఎమ్మార్టీ విభాగం ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పూర్తిగా వర్క్‌మెన్ పోస్టులై ఏళ్ల అన్‌యూజ్డ్‌గా ఉన్న 216 పోస్టులు, ఖాళీగా ఉంటున్న జూనియన్ అసిస్టెట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ 217 పోస్టులను ప్రభుత్వం రద్దు చేస్తూ కొత్తగా 339 ఉద్యోగాలు మంజూరు చేసింది. ఇక్కడి వరకు బాగానే ఉన్నా మంజూరైన పోస్టుల కేటాయింపులో తమకు అన్యాయం జరిగిందని ఎమ్మార్టీ విభాగం ఉద్యోగులు మొత్తుకుంటున్నారు. సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ పోస్టులు పెంచాలని తాము దశల వారీగా ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డిని కలిసి వినతి పత్రాలు సమర్పించి, స్వయంగా కోరినా యాజమాన్యం పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగా మంజూరైన 339 పోస్టుల్లో 48 అసిస్టెంట్ లైన్‌మెన్ పోస్టులు ఉండగా వీటిని 16 సర్కిళ్ల పరిధిలోని 16 ఎమ్మార్టీ విభాగాలకు మూడు పోస్టుల చొప్పున యాజమాన్యం కేటాయించింది. తమకు సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ పోస్టులు కావాలని కోరితే... అవసరం లేని అసిస్టెంట్ లైన్‌మెన్ పోస్టులు ఎమ్మార్టీ విభాగానికి బలవంతంగా రుద్దారని వాపోయారు. టీజీ ఎన్పీడీసీఎల్ పరిధిలోని 16 సర్కిల్ (జిల్లా)లో 16 ఎమ్మార్టీ డివిజన్‌లున్నాయి. ఈ డివిజన్లలో అన్ని క్యాడర్లు కలిపి 285 పోస్టులున్నాయి. వీటికి కొత్తగా 48 అసిస్టెంట్ లైన్‌మెన్ పోస్టులు కలిశాయి. దీంతో పోస్టుల సంఖ్య 333కు చేరింది. ప్రస్తుతం 220 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. ఇందులో లైన్‌మెన్ పోస్టులు 47 ఖాళీగా ఉన్నాయి.

అవసరం లేకున్నా కొత్తగా పోస్టు సృష్టి..

ఎమ్మార్టీలో జూనియర్ లైన్‌మెన్, టెస్టర్ గ్రేడ్–2 (లైన్‌మెన్), టెస్టర్ గ్రేడ్–1 (లైన్ ఇన్‌స్పెక్టర్), ఫోర్‌మెన్ గ్రేడ్–1 పోస్టులు ఉన్నాయి. ఆపరేషన్ విభాగంలో మాదిరి టెస్టర్ గ్రేడ్–1 తర్వాత సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ పోస్టులు సృష్టించాలని డిమాండ్ చేస్తున్నా యాజమాన్యం పట్టించుకోవడం లేదని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇక్కడ జూనియర్ లైన్‌మెన్ నుంచి లైన్‌మెన్ హోదా కలిగిన టెస్టర్ గ్రేడ్–2కు పదోన్నతి ప్రక్రియ కొనసాగుతూ వస్తోంది. ఈ రెండింటి మధ్య అసిస్టెంట్ లైన్‌మెన్ పోస్టు అవసరం లేకున్నా కొత్తగా సృష్టించారని, తమకు టెస్టర్ గ్రేడ్–2 తర్వాత పదోన్నతి అవకాశాలు లేవని, టెస్టర్ గ్రేడ్–2 ఉద్యోగులకు పదోన్నతి లభించేలా సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ పోస్టులు క్రియేట్ చేసి మంజూరు చేయాలని కోరామని ఎమ్మార్టీ ఉద్యోగుల జేఏసీ నాయకులు స్పష్టం చేశారు. ఎన్పీడీసీఎల్ యాజమాన్యం మాత్రం తమ గోడు, విన్నపాన్ని పట్టించుకోకుండా అసిస్టెంట్ లైన్‌మెన్ పోస్టులు సృష్టించి ఏళ్లుగా టెస్టర్ గ్రేడ్–2 ఉద్యోగులుగా పని చేస్తున్న సీనియర్లకు తీరని అన్యాయం చేసిందని వాపోతున్నారు. టెస్టర్ గ్రేడ్ –2 తర్వాత ఫోర్‌మెన్ పోస్టు ఒకటి మాత్రమే ఉందని, దీంతో సీనియర్లు లైన్ ఇన్‌స్పెక్టర్ హోదా కలిగిన టెస్టర్ గ్రేడ్–2గా పని చేస్తూ రిటైర్డ్ అవుతున్నారు. ఆపరేషన్ విభాగంతో సమానంగా తమకు సీనియర్ లైన్ ఇన్స్‌పెక్టర్‌గా అవకాశం కల్పించాలని ఎమ్మార్టీ ఉద్యోగులు కోరుతున్నారు. ఇప్పటికైనా టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం కొత్తగా మంజూరైన పోస్టులను మార్పు చేసి సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ పోస్టులు మంజూరు చేయాలని కోరుతున్నారు. ఇలా చేయడం ద్వారా పైస్థాయి నుంచి దిగువ పోస్టుల వరకు ఉద్యోగులకు పదోన్నతి అవకాశాలు పెరిగి ఉత్సాహంగా పని చేస్తారన్నారు.

ఎమ్మార్టీ విభాగానిది కీలక పాత్ర..

టీజీ ఎన్పీడీసీఎల్‌లో ఎమ్మార్టీ విభాగానికి కీలక భూమిక. సబ్ స్టేషన్లు, డీటీఆర్‌ల నిర్వహణ్యలో వీరి పాత్ర కీలకం. వీటితోపాటు సీటీ, హెచ్‌టీ, ఎల్‌టీ మీటర్లను రోటేషన్ పద్ధతిలో పరీక్షిస్తుంటారు. సబ్ స్టేషన్లలో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల మెయింటెనెన్స్ బాధ్యత కూడా వీరిదే. ఏ మాత్రం అలసత్వం వహించినా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగడమో, నాణ్యమైన, మెరుగైన విద్యుత్ సరఫరాలో ఆటంకాలు ఏర్పడుతాయి. అదే విధంగా డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల లోపాలను సరిదిద్దేది ఈ విభాగం ఉద్యోగులే. విద్యుత్ శాఖలో కీలక పాత్ర పోషిస్తున్న వీరిపై యాజమాన్యం వివక్ష ధోరణి అనుసరించడంతో విసిగిపోతున్నారు.

ఆదివాసీ సంస్కృతి ప్రకారమే జాతర నిర్వహించాలి

- ప్రభుత్వాన్ని కోరిన పూజారులు
- మేడారం మాస్టర్ ప్లాన్‌పై సమావేశం
- అభిప్రాయాలు వెల్లడించిన పూజారులు


సమావేశంలో అభిప్రాయాలు వెల్లడిస్తున్న పూజారి

ఎస్ఎస్‌తాడ్వాయి : ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాల ప్రకారం మేడారం జాతర నిర్వహించాలని పూజారులు కోరారు. గత నెల 3వ తేదీన రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రధాన కార్యదర్శి శైలజారామయ్యర్, మంత్రి సీతక్క మేడారాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మేడారం మాస్టర్ ప్లాన్‌లోని శాశ్వత నిర్మాణాలను పరిశీలించారు. గద్దెల డిజైన్‌లోని మార్పులు, చేర్పులపై పూజారుల అభిప్రాయాలు స్వీకరించేందుకు వారితో సమావేశం నిర్వహించాలని శైలజారామయ్యార్ ఆదేశించారు. దీంతో మంగళవారం మేడారంలోని ఐటీడీఏ అతిథి గృహంలో కలెక్టర్ దివాకర్ టీఎస్.. సమ్మక్క, సారలమ్మ పూజారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వనదేవతల గద్దెల డిజైన్‌పై పూజారులు తమ అభిప్రాయాలు వెల్లడించారు. అమ్మవార్ల గద్దెలపై ఎత్తు బంగారం, కొబ్బరి, పసుపు, కుంకుమ సమర్పించి మొక్కులు చెల్లించుకోవడం వలన భక్తులకు సంతృప్తి కలుగుతుందని, సమ్మక్క, సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజుల గద్దెల పైకప్పు డిజైన్ తొలగించాలని కలెక్టర్‌కు వివరించారు. అమ్మవార్ల గద్దెలను యథావిధిగా ఉంచాలన్నారు. పూజారుల అభిప్రాయం మేరకు గద్దెల డిజైన్‌లో మార్పులు, చేర్పులు చేస్తామని కలెక్టర్ దివాకర్ టీఎస్ అన్నారు. మరోసారి ఈనెల 11వ తేదీన సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. మేడారంలో శాశ్వత అభివృద్ధి నిర్మాణ పనులకు పూజారులు సహకరించాలన్నారు. సమావేశంలో ఈఓ వీరస్వామి, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, పూజారులు కొక్కెర రమేశ్, చందా రఘుపతి, కాక సారయ్య, కొక్కెర కృష్ణయ్య, సిద్దబోయిన అరుణ్‌కుమార్, భోజారావు, సిద్ధబోయిన రమేశ్, పూజారులు పాల్గొన్నారు.

క్యాంపు కార్యాలయానికి వెళ్లలేదని..

- ఐదుగురు కార్మికుల తొలగింపు..
- ఆరోగ్య వర్సిటీ ఎదుట బాధితుల ఆందోళన

ఎంజీఎం : కాళోజీ ఆరోగ్య వర్సిటీలో కొన్నేళ్లుగా ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా విధులు చేసుకుంటూ తమ కుటుంబాన్ని పోషించుకుంటున్న క్రమంలో కాంట్రాక్టర్ తమను హైదరాబాద్‌లోని క్యాంపు కార్యాలయానికి వెళ్లాలని ఆదేశించగా, వెళ్లకపోవడంతో ఐదుగురు కార్మికులను అన్యాయంగా విధులనుంచి తొలగించారని బాధితులు ఊట రూప, గణేశ్ అనే కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. వీసీ ఆదేశాల మేరకు తమను కాంట్రాక్టర్ విధులనుంచి తొలగించారని మంగళవారం వరంగల్ నగరంలోని ఆరోగ్య వర్సిటీ ప్రధానద్వారం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్సిటీ స్థాపించినప్పటినుంచి ఇక్కడ పనిచేస్తున్నామని, రూ.12,500తో ఇక్కడ బతకడమే కష్టంగా ఉందని, హైదరాబాద్‌కు వెళ్లి ఎలా జీవనం సాగిస్తామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలో 28 మంది పనిచేస్తుంటే ఐదుగురు కార్మికులను మాత్రమే ఎందుకు తొలగించారో అర్థం కావడం లేదన్నారు. తమను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

క్యాంపు కార్యాలయానికి కార్మికులను పంపించామన్నాం : వీసీ నందకుమార్

హైదరాబాద్‌లోని ఆరోగ్య వర్సిటీ క్యాంపు కార్యాలయానికి సిబ్బందిని కేటాయించాలని స్పష్టంగా ఉత్తర్వులు ఉన్నాయి. గతంలో వీసీ కరుణాకర్‌రెడ్డి స్థానికంగా ఉండడం వల్ల ఈ విషయాన్ని ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. ప్రస్తుతం హైదరాబాద్‌లోనా క్యాంపు కార్యాలయం ఉండడం చేత సంస్థ ప్రతినిధికి ఐదుగురు కార్మికులను హైదరాబాద్‌కు కేటాయించాలని చెప్పా. నేను ఎవరినీ తొలగించాలని చెప్పలేదు. ఈ విషయాన్ని సైతం నోటీసు ద్వారా తెలియజేశాం. విచారణ జరిపి కాంట్రాక్టు సంస్థపై చర్యలు తీసుకుంటాం.

'వేం' కారునుంచి పొగ


పొగ ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మండలం సోమ్లు తండా గ్రామ శివారులోని హెలిపాడ్ సమీపంలో నిలిపిన ఇన్నోవా కారు నుంచి మంగళవారం ఒక్కసారిగా పొగ వచ్చింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ల్యాండ్ అయ్యే హెలిపాడ్ సమీపంలో రోడ్డు పక్కన ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి వాహనం నిలిపారు. అందులో నుంచి పొగ రాగానే గమనించి అగ్నిమాపక సిబ్బంది వెంటనే టియర్ గ్యాస్ ఉపయోగించి ఆర్పివేశారు. కారు ఇంజిన్ భాగంలో ఏసీ షార్ట్ సర్క్యూట్ జరిగి పొగ వచ్చిందని, పొగ ఆర్పివేయడంతో పెద్ద ప్రమాదం తప్పిందని అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు పేర్కొన్నారు.

మంత్రులు ఏమన్నారంటే..


కేసముద్రంలో జరిగిన బహిరంగ సభకు హాజరైన కార్యకర్తలు, జనం

సాక్షి, మహబూబాబాద్/ కేసముద్రం/ మహబూబాబాద్‌రూరల్ : మహబూబాబాద్ నియోజకవర్గ పరిధి సోమ్లాతండా, కేసముద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన బహిరంగ సభలు పండుగ వాతావరణాన్ని తలపించాయి. పెద్ద ఎత్తున మహిళలు, కార్యకర్తలు తరలిరావడంతో సందడి నెలకొంది. ఈ సందర్భంగా పలువురు మంత్రులు ప్రసంగించారు.

భూ భారతితో సమస్యలకు పరిష్కారం



ప్రభుత్వ భూములకు కాజేసేందుకు గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి చట్టంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. ఎన్నికల ముందు చెప్పిన విధంగా ధరణి స్థానంలో భూభారతి చట్టం తీసుకొచ్చాం. ఈ కొత్త చట్టంతో మహబూబాబాద్ జిల్లాలోని నారాయణపురం, సీతానాగారం, పంతులు తండా రైతుల సమస్యను పరిష్కరించాలని కలెక్టర్‌ను ఆదేశిస్తున్నా.

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు



కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినాటి నుంచి ఒక వైపు అప్పులు తీర్చుకుంటూ.. మరోవైపు ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతుంది. గత ప్రభుత్వంలో కేసీఆర్ కుటుంబమే బాగుపడింది. ఇప్పుడు ప్రజలకు ఇచ్చిన హామీలతోపాటు కొత్త పథకాలు తెచ్చి కాంగ్రెస్‌ది ప్రజాపాలన అని రుజువు చేస్తున్నాం.

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

దేశం మొత్తం తెలంగాణ వైపు చూస్తోంది



సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో అమలు అవుతున్న సంక్షేమ పథకాలను చూసి దేశం మొత్తం తెలంగాణను ఆదర్శంగా తీసుకుంటుంది. అసాధ్యం అనుకున్న రైతు రుణమాఫీ, రైతు భరోసా వంటి పథకాలను అమలు చేశాం. ఇక ముందు కూడా పథకాల అమలులో వెనకాడేది లేదు.

- మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

ప్రతిపక్షాల తప్పుడు ప్రచారం తిప్పికొట్టాలి



కాంగ్రెస్ అంటేనే కష్టజీవులు, పేదల గురించి ఆలోచించే ప్రభుత్వం. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఇందిరమ్మ కలలు కన్న పాలన అందిస్తున్నాం. కాంగ్రెస్ పార్టీ ప్రజల కోసం పనిచేయడాన్ని జీర్ణించుకోలేక ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయి. కార్యకర్తలు దానిని తిప్పికొట్టాలి.

- మంత్రి కొండా సురేఖ

పేదల ఆకలి తెలిసిన ప్రభుత్వం



కాంగ్రెస్ అంటేనే ఇందిరమ్మ ప్రభుత్వం. పేదల ఆకలి తెలిసిన ప్రభుత్వం కావడంతోనే సన్న బియ్యం అందజేసి వారి తీరుస్తున్నాం. ఇందిరమ్మ ఇళ్లతో నిలువ నీడను అందిస్తున్నాం. మహిళలను శ్రీమంతులను చేసేందుకు వడ్డీలేని రుణాలు పంపిణీ చేస్తున్నాం.

-మంత్రి సీతక్క

కష్టపడుతున్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి



మహబూబాబాద్ జిల్లాలో ప్రజాపాలన– ప్రగతిపాలన పేరుతో నిర్వహించిన సభలకు డిప్యూటీ సీఎం, ఐదుగురు మంత్రులు రావడం సంతోషకరం. గిరిజనులు ఎక్కువగా ఉన్న జిల్లాకు ఎక్కువ నిధులు ఇచ్చి అభివృద్ధి పథంలో నడిపిస్తున్న మంత్రులకు కృతజ్ఞతలు. కష్టపడి పనిచేస్తున్న ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించాలి.

- వేం నరేందర్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు

ఆలోచన అదుర్స్..

- బైక్‌కు పానీపూరి బండి ఏర్పాటు
- ఆకట్టుకుంటున్న మొబైల్ పానీపూరి వాహనం


పానీ పూరి విక్రయిస్తున్న బానోత్ రమేశ్


బైక్‌కు ఆల్టేషన్ చేసిన పానీ పూరి బండి

పాలకుర్తి టౌన్ : సాధారణంగా పానీపూరి బండి ఒక ప్రాంతంలో ఆ రహదారిపైనే కనిపిస్తుంది. లేదా షాపులో మాత్రమే ఉంటుంది. వినియోగదారులు అక్కడికెళ్లి మాత్రమే తినాల్సి ఉంటుంది. అయితే ఓ యువకుడు వినూత్నంగా ఆలోచించాడు. వినియోగదారులు వ్యాపారి వద్దకు కాకుండా వ్యాపారే వినియోగదారుడి వద్దకు వెళ్లేలా కొత్తగా ఆలోచించాడు. అనుకున్నదే తడువుగా బైక్(మొబైల్ పానీ పూరి)కు పానీపూరి బండి అమర్చి నేరుగా వినియోగదారుల వద్దకే వెళ్లి విక్రయిస్తున్నాడు. అతనే పాలకుర్తి మండలం టీఎస్‌కే తండాకు చెందిన బానోత్ రమేశ్. బైక్‌ను సగభాగం వరకు తొలగించి పానీపూరి డబ్బాను ఆల్టేషన్ చేసి అందంగా ముస్తాబు చేసి పాలకుర్తి మండల కేంద్రంలో విక్రయిస్తున్నాడు. దీంతో ఈ మొబైల్ పానీపూరి బండిని చూసిన వినియోగదారులు ఆలోచన..అదుర్స్ అంటూ కొనియాడుతున్నారు. బైక్‌కు రూ. 80వేలకు కొనుగోలు హైదరాబాద్‌లో పానీపూరి డబ్బాను ఆల్టేషన్ చేసినట్లు రమేశ్ తెలిపారు. కాగా, రమేశ్ పానీపూరిని ముందస్తుగానే వివాహ, శుభ కార్యాలకు భోజన ప్రియులు అడ్వాన్స్ బుకింగ్ చేసుకుంటున్నారు.

ప్రాణహిత పరవళ్లు..

- కాళేశ్వరం వద్ద 6.600 మీటర్ల ఎత్తులో నీటిమట్టం
- 1.33 లక్షల క్యూసెక్కుల నీరు విడుదల


కాళేశ్వరంలోని సరస్వతీఘాట్ వద్ద వరద ప్రవాహం

కాళేశ్వరం: మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలతో కాళేశ్వరం వద్ద గోదావరితో కలిసి ప్రాణహిత నది పరవళ్లు తొక్కుతోంది. మంగళవారం వరద ప్రవాహం పెరగడంతో మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని త్రివేణి సంగమం సరస్వతీఘాట్ వద్ద మెట్లను తాకుతూ 6.600 మీటర్ల ఎత్తులో నీటిమట్టం నమోదై దిగువకు కాళేశ్వరం మీదుగా తరలింది. దీంతో కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి మేడిగడ్డ(లక్ష్మి) బ్యారేజీకి రెండు రోజుల నుంచి వరద తాకిడి పెరుగుతోంది. 1.33లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం చేరుతుండగా..బ్యారేజీ మొత్తం 85 గేట్లు ఎత్తివేసి వచ్చిన నీటిని వచ్చినట్లు విడుదల చేస్తున్నారు. బుధవారం మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు ఇంజనీరింగ్ అధికారులు పేర్కొంటున్నారు.

జ్వరంతో బాలుడి మృతి

- ఇంజక్షన్ వికటించడంతోనే మృతి చెందాడని పోలీసులకు ఫిర్యాదు


చరణ్‌సింగ్ (ఫైల్)

కేసముద్రం: జ్వరంతో ఓ బాలుడి మృతి చెందాడు. ఈ ఘటన ఇనుగుర్తి మండలం తారాసింగ్ తండాజీపీ శివారు బావోజీతండాలో చోటు చేసుకుంది. ఎస్సై మురళీధర్‌రాజు కథనం ప్రకారం..తండాకు చెందిన ధారావత్ బాలాజీ, అనిత దంపతుల పెద్దకుమారుడు చరణ్‌సింగ్(15) మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. కాగా, వారం క్రితం జ్వరం రావడంతో ఇంటికి తీసుకొచ్చారు. ఈక్రమంలో సోమవారం రాత్రి ఆ బాలుడికి జ్వరంతోపాటు కడుపునొప్పి రావడంతో కేసముద్రం మండలం కల్వల గ్రామంలోని ఓ ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లారు. సదరు వైద్యుడు ఇంజక్షన్ ఇచ్చాడు. ఆ తర్వాత మానుకోట జనరల్ ఆస్పత్రికి తరలించగా మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. కాగా, ఇంజక్షన్ వికటించడంతోనే తమ కుమారుడు చనిపోయాడని ఆరోపిస్తూ మృతుడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై మురళీధర్‌రాజు తెలిపారు.

సైలెన్సర్లు మారిస్తే క్రిమినల్ చర్యలు

- ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ రాయల ప్రభాకర్‌రావు
- రోడ్డు రోలర్‌తో అధిక శబ్దం వచ్చే సైలెన్సర్ల ధ్వంసం


రోడ్డు రోలర్‌తో సైలెన్సర్లను ధ్వంసం చేయిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

వరంగల్ క్రైం: ద్విచక్రవాహనాలకు కంపెనీతో వచ్చిన సైలెన్సర్లు మారిస్తే వాహనదారుడితోపాటు మార్చిన మెకానిక్‌పై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని వరంగల్ కమిషనరేట్ ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ రాయల ప్రభాకర్‌రావు హెచ్చరించారు. అధిక శబ్దం చేసే ద్విచక్రవాహన సైలెన్సర్లను ట్రాఫిక్ పోలీసులు మంగళవారం కేయూసీ జంక్షన్ వద్ద రోడ్డు రోలర్‌తో ధ్వంసం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్రవాహనాలకు ఏర్పాటు చేసిన అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లను గుర్తించి తొలగించినట్లు పేర్కొన్నారు. వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహించి రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు. ట్రాఫిక్ పోలీసులు తొలగించిన సైలెన్సర్లను మరోమారు వినియోగించకుండా రోడ్డురోలర్‌తో ధ్వంసం చేసినట్లు వివరించారు. ఇందులో హనుమకొండకు చెందిన 275, కాజీపేట 111, వరంగల్‌వి 75 సైలెన్సర్లు ఉన్నట్లు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ద్విచక్రవాహనాల సైలెన్సర్లను మార్చడం చట్టరీత్యా నేరమని, శబ్ద కాలుష్య నియంత్రణతోపాటు ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఎక్కువ శబ్దం చేసే ద్విచక్రవాహనాలపై ప్రత్యేక దృష్టి సారించి తనిఖీలు చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, వరంగల్, హనుమకొండ, కాజీపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణ, సీతారెడ్డి, వెంకన్న, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వాలవి కార్మిక వ్యతిరేక విధానాలు


సమావేశంలో మాట్లాడుతున్న వినయ్‌భాస్కర్, చిత్రంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు

- బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్

హన్మకొండ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నాయని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ విమర్శించారు. బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్రంలోని మోదీ ప్రభుత్వం రద్దు చేసి, యాజమాన్యాలకు అనుకూల నాలుగు కోడ్‌లు తీసుకొచ్చిందని ధ్వజమెత్తారు. బుధవారం జరిగే సమ్మెకు కాంగ్రెస్ అనుబంధ ఐఎన్‌టీయూసీ మద్దతు ఇచ్చిందన్నారు. అయితే 10 పని గంటల విధానాన్ని తీసుకువస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీఓ 282 జారీ చేసిందని దుయ్యబట్టారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేశ్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సారంగపాణి, ఐఎఫ్ టీయూ జిల్లా కార్యదర్శి నున్నా అప్పారావు, టీఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బొట్ల భిక్షపతి మాదిగ, మున్సిపల్ ఎంప్లాయీస్ జేఏసీ నాయకుడు ధర్మరాజు మాట్లాడారు. బుధవారం ఉదయం 10 గంటలకు ఏకశిల పార్కు నుంచి సుబేదారిలోని కలెక్టరేట్ వరకు ర్యాలీ తీయనున్నట్లు తెలిపారు. టీఎస్ టీయూసీ నాయకుడు శ్యాం, మన తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు ఇసంపల్లి సంజీవ, బీఆర్‌టీయూ నాయకుడు నాయిని రవి, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.